

క్లుప్తంగా

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



జనగామ: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. న్యూ ఇయర్ వేడుకలను కుటుంబ సభ్యుల సమక్షంలో జరుపుకోవాలని సూచించారు.

నియోజకవర్గానికి రూ.750కోట్లు తీసుకొచ్చా..

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గ అభివృద్ధే ఎజెండాగా.. ఎమ్మెల్యేగా ఎన్నికైన ఏడాదిలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం సహకారంతో రూ.750 కోట్ల అభివృద్ధి పనులకు మంజూరీ తీసుకొచ్చానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం కప్ పారా క్రీడలకు తరలిన దివ్యాంగులు



జనగామ రూరల్: ఈనెల 1,2వ తేదీల్లో హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీబీ స్పోర్ట్స్ స్టేడియంలో నిర్వహించనున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి పారా క్రీడా పోటీలకు జిల్లా నుంచి 24 మంది దివ్యాంగ క్రీడాకారులు మంగళవారం తరలివెళ్లారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద జిల్లా క్రీడాధికారి వెంకట్‌రెడ్డి వారు వెళ్తున్న వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు.

చర్యలు తీసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్: అక్కపెల్లిగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అవినీతికి పాల్పడుతున్నాడని, అతడిపై తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, పార్టీ గ్రామశాఖ కార్యదర్శి మేడిద భూపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని అక్కపెల్లిగూడెంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సర్వేలో ఇందిరమ్మ కమిటీ సభ్యులను కాదని ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అదే విధంగా గ్రామంలో ఈజీఎస్ పనులు, ఇతర అభివృద్ధి పనుల్లో అవినీతి పాల్పడ్డాడన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని తెలిపారు. బొమ్మగళ్ల మంజుల, సురేష్, కుమారస్వామి పాల్గొన్నారు. కాగా, ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి అవినాష్‌ను వివరణ కోరగా తనపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తమన్నారు. కొందరు ఉద్దేశ్యపూర్వకంగా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, గ్రామస్తుల సమక్షంలో ఈ విషయమై ఏ విచారణకైనా తాను సిద్ధమేనని పేర్కొన్నారు.

విచారణ

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని అక్కపెల్లిగూడెం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి అవినాష్ ఈజీఎస్ పనులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వే విషయంలో అవినీతికి పాల్పడుతున్నాడని వచ్చిన ఫిర్యాదు మేరకు జీపీ కార్యాలయంలో ఈజీఎస్ అధికారులు, సిబ్బంది సమక్షంలో అదనపు డీఆర్డీఓ చంద్రశేఖర్ మంగళవారం విచారణ చేపట్టారు. కాగా, విచారణలో మెజార్టీ ప్రజలు కార్యదర్శికి అనుకూలంగా వాంగ్మూలం ఇవ్వగా, కొందరు అతడు ఇష్టారాజ్యంగా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఏది ఏమైనా విచారణ అధికారుల సాక్షిగా రసాభాసగా జరిగింది. అనంతరం అదనపు డీఆర్డీఓ మాట్లాడుతూ అందరూ సంయమనం పాటించాలని, విచారణ నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపీఓ నర్సింగరావు, ఏపీఓ ప్రేమయ్య పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



జనగామ రూరల్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోశాధికారి నరసింహారెడ్డి చేతుల మీదుగా మంగళవారం కలెక్టరేట్‌లో నూతన సంవత్సరం క్యాలెడర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి జగ్గారెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను, పెన్షనర్లకు హెల్త్ కార్డులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరయ్య, ఇప్పరాం రెడ్డి, సీహెచ్ రాజా నరసింహారెడ్డి, బి.చుక్కయ్య రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన కాల్వ పనులు పూర్తి

● జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రాంబాబు

రఘునాథపల్లి: సర్వే నంబర్లు సక్రమంగా లేని రైతులకు అవార్డు ఇప్పించి బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి యుద్ధప్రాతిపదికన కాల్వల పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మారుజోడు రాంబాబు అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు మంగళవారం అధికారులు, కాంగ్రెస్ నాయకులు, రైతులతో కలిసి కాల్వలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. రిజర్వాయర్ నుంచి మచ్చుపహడ్‌కు వెళ్లే మెయిన్ కెనాల్ వద్ద యూటీ ఏర్పాటు చేసి.. ఓ కాల్వ ద్వారా రామరాయనిబంగ్లా నుంచి మండలగూడేకు, మరొక కాలువ ద్వారా గిద్దబండ తండా నుంచి మంగళిబండతండా, ఆంధ్రతండా, తొక్కుడు బండతండా, మంగళిబండతండా గ్రామాలకు పది వేల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా ప్రణాళికలు తయారు చేశామన్నారు. నిలిచిన కాల్వ పనులు వారం రోజుల్లో పునం ప్రాంరభిస్తామన్నారు. యాసంగి పంటలకు నీరందించే విధంగా ఎమ్మెల్యే చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జనగామ ఆర్డీఓ గోపిరామ్, తహసీల్దార్ మోహిస్సన్ ముజ్జబ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్‌చందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రవిగౌడ్, పీఏసీఎస్ ఛైర్మన్ రవీందర్, బుచ్చయ్య, భాస్కర్ యాదవ్, తదితరులు ఉన్నారు.



కాల్వలు పరిశీలిస్తున్న రాంబాబు, అధికారులు తదితరులు

ఇళ్ల సర్వే జాప్యంపై అదనపు కలెక్టర్ ఆరా

రఘునాథపల్లి: ఇందిరమ్మ ఇళ్ల సర్వే జాప్యంపై అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. మండలంలో 76 శాతం మాత్రమే సర్వే పూర్తికాగా.. జాప్యంపై ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో యాప్‌లో వివరాల నమోదులో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. అవాంతరాలను అదిగమించి సర్వే వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.



సర్వే వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

కుర్మవాడలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

జనగామ: పట్టణంలోని కుర్మవాడలో విద్యుత్ సరఫరాలో ఓవర్ లోడ్ తగ్గించేందుకు ఎన్పీడీసీఎల్ అధికారులు మంగళవారం కొత్తగా 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఏడీఈ వేణు గోపాల్, ఏఈ సౌమ్య, స్థానిక కౌన్సిలర్ జూకంటి లక్ష్మీశ్రీశైలం పర్యవేక్షణలో ఎస్ఎస్7/160కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఓవర్‌లోడ్‌ను తగ్గించేందుకు కొత్తది బిగించారు. ఇక నుంచి కుర్మవాడలో లోఓల్టేజీ సమస్య ఉండదని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ ఎం.మనోహర్, లైన్ ఇన్స్‌పెక్టర్ రాంబాబు, లైన్‌మన్ ప్రసాద్, ఏఎల్ఎం రమేశ్, సాయినగర్‌కు చెందిన పలువురు వినియోగదారులు ఉన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అధికారులు, ఉద్యోగులు

నర్సరీలను సక్రమంగా నిర్వహించాలి

● అదనపు డీఆర్డీఓ చంద్రశేఖర్



నర్సరీని పరిశీలిస్తున్న చంద్రశేఖర్

స్టేషన్‌ఘన్‌పూర్: ఈజీఎస్ అధికారులు, సిబ్బంది బాధ్యతగా పనిచేస్తూ నర్సరీలను సక్రమంగా నిర్వహించాలని అ దనపు డీఆర్డీఓ చంద్రశేఖర్ అన్నారు. అక్కపెల్లిగూడెం నర్సరీని ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఫీల్డ్ అసిస్టెంట్, ఈజీఎస్ సిబ్బందితో కలిసి నర్సరీని పరిశీలించారు. నర్సరీలోని బ్యాగ్‌లలో విత్తనాలు పెడుతున్నతీరును పరిశీలించారు. ఏపీఓ ప్రేమయ్య, ఈసీ కిరణ్‌కుమార్, టీఏ జాంబ, కవిత, ఎల్లగౌడ్, పంచాయతీ కార్యదర్శి అవినాష్, అఖిల్ పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

● తహసీల్దార్ సరస్వతి

చిల్పూరు: ప్రతీ ఒక్కరూ తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ సరస్వతి అన్నారు. మండలంలోని పల్లగుట్ట గ్రామంలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని పౌరహక్కులపై అవగాహన కల్పించారు. నాయబ్ తహసీల్దార్ రామారావు, ఎంపీఓ మదుసూధన్, ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్, ఐకేపీ ఏపీయం ఈద రమేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి బాపునాయక్ పాల్గొన్నారు.

జనగామ రూరల్: చౌడారం గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. నాయబ్ తహసీల్దార్ జగన్, సీఐ దామోదర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఎంపీడీఓ సంపత్ కుమార్, ఎస్ఐ రాజన్ బాబు పంచాయతీ కార్యదర్శి రాజు, మాజీ సర్పంచ్ రాజయ్య పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సరస్వతి

చర్చిలో న్యూ ఇయర్ వేడుకలు



బేకరీలో కేక్‌ల కొనుగోలు సందడి



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

చిల్పూరు: మండలం మల్కాపూర్ గ్రామంలోని సేంట్ అల్ఫోన్సస్ చర్చి లో మంగళవారం రాత్రి నుంచి న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విచారణ గురువు మాచర్ల నవీన్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశా రు. మునిపెల్లి ప్రభాకర్, ఆనందం, రాజేందర్, సుధాకర్ పాల్గొన్నారు.

కేక్‌ల కొనుగోళ్లు..

దేవరుప్పుల: నూతన సంవత్సరం పురస్కరించుకుని నిర్వహించుకునే స్వాగత ఆడంబరాల కోసం మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ సందడి కనిపించింది. కొత్త సంవత్సరంలో ఇంటిముంగిట మహిళలు స్వాగత ముగ్గుల కోసం రంగుల కొనుగోళ్లు, పాత ఏడాదికి శుభం, కొత్త ఏడాదికి స్వాగతం తెలిపేందుకు బేకరీలో కేక్ కొనుగోళ్ల జోరు, ఇంటింటా నిండుకునేందుకు నిత్యావసర సరుకుల కోసం దుకాణాల్లో బారులుదీరారు.

ఉద్యోగికి విరమణ సహజం



శ్యాంసుందర్‌ను సన్మానిస్తున్న రేమెస్‌బాబు

పాలకుర్తి టౌన్: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని జిల్లా అగ్నిమాపక అధికారి రేమస్ బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఫైర్ స్టేషనలో లీడింగ్ ఫైర్‌మెన్ గోవిందు శ్యాంసుందర్ పదవీవిరమణ కార్యక్రమంలో శ్యామ్ సుందర్‌ను సహచర ఉద్యోగులు, స్థానికులు శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రేమెస్‌బాబు మాట్లాడుతూ శ్యాంసుందర్ అంకితభావం గల ఉద్యోగి అని, విధి నిర్వహణలో క్రమశిక్షణగా మెలిగేవాడని తెలిపారు. పాలకుర్తి ఫైర్ ఆఫీసర్ శ్రీరాములు, అగ్నిమాపక విభాగం, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు

రఘునాథపల్లి/బచ్చన్నపేట: ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పాదల లవకుమార్, మండల అధ్యక్షుడు కందుకూరి వంశీతేజ జెండా ఆవిష్కరించారు. నాయకులు మామిడాల రమేష్, దాసగాని సుమ, మండల ఉపాధ్యక్షుడు గొడుగు రమేశ్, భాస్కర్, అక్షిత్, సాయి, కడారి మానస పాల్గొన్నారు. అలాగే బచ్చన్నపేటలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని మండల కార్యదర్శి దండగుల మురళీకృష్ణ జెండాను ఆవిష్కరించారు. సాగర్, కర్ణాకర్, స్నేహ, నశ్విత, శృతి తదితరులు పాల్గొన్నారు.



జెండావిష్కరణలో నాయకులు

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి

● ఏడీఏ వసంత సుగుణ

లింగాలఘణపురం: రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏడీఏ వసంత సుగుణ కోరారు. నాగారంలో రైతు మోహన్‌రెడ్డి వరి పంటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. సేంద్రియ సాగుతో భూమిలో కర్బన స్థిరీకరణ, సారవంతం, నేలలో సూక్ష్మజీవుల పెరుగుదల వంటి ప్రయోజనాలుంటాయన్నారు. ఏఈఓ ప్రత్యూష, రైతులు ఉన్నారు.



వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ వసంత సుగుణ

యూటీఎఫ్ రాష్ట్ర కమిటీలో జిల్లాకు పెద్దపీట

జనగామ రూరల్: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఈ నెల 28, 29, 30 తేదీల్లో నల్గొండలో జరిగిన రాష్ట్ర మహాసభలలో జనగామ జిల్లాకు చెందిన పలువురికి రాష్ట్ర కమిటీ స్థానం లభించింది. రాష్ట్ర కార్యదర్శిగా రంజిత్‌కుమార్ ఎన్నిక కాగా ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా శ్రీనివాస రావు, రాష్ట్ర కమిటీ సభ్యులుగా మదూరి వెంకటేశ్, చంద్రశేఖర్ రావు, హేమలత ఎన్నికైయ్యారని జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.



శ్రీనివాసరావు



రంజిత్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి

పశువైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

పాలకుర్తి: పశువైద్య శిబిరాన్ని రైతులు వినియోగించుకోవాలని మండల పశువైద్యాధికారి దేవిరెడ్డి అశోక్ అన్నారు. మంగళవారం తిర్మలగిరిలో జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పశువులకు చికిత్సలు నిర్వహించి రైతులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం దేవిరెడ్డి అశోక్ మాట్లాడుతూ పశువులకు లింగనిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయిస్తే ఆడదూడలే పుడతాయన్నారు. గోపాలమిత్ర సూపర్ వైజర్ రాజేశ్వర్‌రావు, సమ్మయ్య, సమ్మయ్య, పాడి రైతులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన నాయకులు

బచ్చన్నపేట: రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ శైలజారామయ్యను మండల కేంద్రానికి చెందిన పలువురు నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. పద్మశాలి సంఘం రాష్ట్ర జాయింట్ కార్యదర్శి గుర్రపు బాల్‌రాజు, ప్రచార కార్యదర్శి కృష్ణమూర్తి ఉన్నారు.

పిల్లలను తల్లిదండ్రులు గమనించాలి

బచ్చన్నపేట: నేటి యువత చెడు అలవాట్లకు త్వరగా ఆకర్షితులవుతున్నారని, వారిని తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని ఎస్సై హమీద్ అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం హమారా విలేజెస్ బృందం తీసిన పాటలను ఎస్సై ఆవిష్కరించారు. విలేజ్ టీం సభ్యులు కానుగంటి ఉదయ్‌కుమార్, కోడూరి కార్తీక్, లక్కిరెడ్డి శ్రీకాంత్, శ్రీనివాస్, రవళి, వెంటేష్, కిరణ్, శ్రీశైలం, ప్రవీణ్ పాల్గొన్నారు.

పద్మశాలి సేవా కమిటీ ఎన్నిక

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని బీడీ కాలనీలో గాయత్రి పద్మశాలి సేవా నూతన కమిటీని ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వేముల బాలరాజు ఆధ్వర్యంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తడ్కపల్లి విఠోభ, ఉపాధ్యక్షుడిగా ఉదమర్రి వెంకటేశం, కార్యదర్శిగా ఘనపురం ఆనంద్, కోశాధికారిగా కుడికాల సతీష్, కమిటీ సభ్యులుగా కృష్ణమూర్తి, కిషన్, నవీన్, ఉప్పలయ్య, సుధాకర్, భూమయ్య, విశ్వనాథం ఎన్నికయ్యారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాలకుర్తి/జఫర్‌గఢ్: ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలతోపాటు బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గూడూరు, జఫర్‌గఢ్ పాఠశాలల హెచ్‌ఎంలు రేణుక రాథోడ్, వరలక్ష్మి తెలిపారు. మంగళవారం వారు వేర్వేరుగా మాట్లాడారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23న జరుగుతుందని చెప్పారు. ఈ నెల 21వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్లు తెలిపారు.

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన పూజ

చిల్పూరు: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం భక్త జనసందోహం నడుమ ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో అష్టదళ పాద పద్మారాధన పూజ వైభవంగా నిర్వహించారు. భక్తుల సమక్షంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మంతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేదమంత్రాల నడుమ పూజలు చేశారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న, మల్లికార్జున్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

దేవరుప్పుల: నూతన సంవత్సర స్వాగత ఉత్సవాల పేరిట చోటుచేసుకునే రోడ్డు ప్రమాదాల నివారణకు శాఖపరంగా కఠిన చర్యలు చేపట్టాలని జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ సూచించారు. మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని జనగామ–సూర్యాపేట రహదారి చౌరస్తాలో ఎస్సై ఊర సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన వాహనాల తనిఖీని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే..

చిల్పూరు: నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు ఉపక్రమిస్తే చర్యలు తప్పవని జనగామ రూరల్(రఘునాథపల్లి)సీఐ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. చిన్నపెండ్యాల గ్రామ సమీపంలోని జాతీయ రహదారిలోని బస్‌స్టేజీ వద ఎస్సై నవీన్‌కుమార్ మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్యవైశ్యులు

జఫర్‌గఢ్: ఆర్యవైశ్య సంఘం మండల నూతన అధ్యక్షుడిగా అంచూరి యుగంధర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు మండలానికి చెందిన ఆర్యవైశ్యులు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని హనుమకొండలో మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జనగామ: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. నర్మెట మండలం కన్నెబోయినగూడేనికి చెందిన ఉప్పరి సాయికృష్ణ, దేశెట్టి అజయ్ ఇద్దరు స్నేహితులు కలిసి ద్విచక్ర వాహనంపై జనగామకు వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో వడ్లకొండ క్రాసింగ్ సమీపంలో డివైజర్‌ను ఢీకొట్టారు. దీంతో అజయ్ (27) తల పగిలి అక్కడికక్కడే మృతి చెందగా సాయికృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై చెన్నకేశవులు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. మృతుడికి తల్లి, తమ్ముడు ఉన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి

జనగామ రూరల్: ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖ డిప్యూటీ సెక్రెటరీ యాదగిరి అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల, స్టేషన్ రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడారు. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. విద్యార్థులకు పరీక్షలపై భయాన్ని పోగొట్టాలని సూచించారు. ఇంటర్ విద్యాధికారి జితేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.